నమస్తే తెలంగాణ

- **నాడు:** టిమ్‌కుక్, కేసీఆర్‌తో కేటీఆర్ సెల్ఫీ

హైదరాబాద్ నానక్‌రాంగూడలోని వేవ్‌రాక్ బిల్డింగ్‌లో ఆపిల్ కార్యాలయం ప్రారంభోత్సవంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆపిల్ సీఈవో టిమ్‌కుక్‌తో మాజీ మంత్రి కేటీఆర్ సెల్ఫీ (19.05.2016)

- **నేడు:** ఆపిల్ ఆఫీసు బయట రేవంత్

అమెరికా కాలిఫోర్నియాలోని ఆపిల్ కేంద్ర కార్యాలయం బయట సీఎం రేవంత్ రెడ్డి (09.08.2024)

తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్

ఇకపై అలాగే పిలుద్దాం • సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు • అడోబ్ సీఈవోతో భేటీ

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఇకపై తెలంగాణ రాష్ర్టాన్ని 'ఫ్యూచర్ స్టేట్ (భవిష్యత్తు రాష్ట్రం)' అని పిలుద్దామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రం 'ది ఫ్యూచర్ స్టేట్'కు పర్యాయ పదంగా నిలుస్తుందని చెప్పారు. అమెరికా పర్యటనలో భాగంగా కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్ టేబుల్‌లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెక్ యూనికార్న్స్ సీఈవోలను ఉద్దేశించి మాట్లాడారు. ఆయా సంస్థలను తెలంగాణకు ఆహ్వానించారు. 'మీ భవిష్యత్తును ఆవిష్కరించుకోండి. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం' అని పిలుపునిచ్చారు. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం, దానిని సూచించే నినాదం ఉన్నదని, ఇదే తరహాలో తెలంగాణను ఫ్యూచర్ స్టేట్ ట్యాగ్ లైన్‌తో పిలుద్దామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రఖ్యాత అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో భేటీ అయ్యారు. హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ నిర్మాణం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటు ప్రణాళికలను వివరించారు. హైదరాబాద్‌లో పెట్టుబడులపై ఆయన ఆసక్తి కనబరిచారని సీఎంవో తెలిపింది. టెక్ విజనరీ శంతను నారాయణ్‌ను కలుసుకోవటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అమెరికాలోనే అతి పెద్ద బయోటెక్నాలజీ కంపెనీ ఆమ్‌జెన్ తెలంగాణలో కార్యకలాపాలను విస్తరించనున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆమ్‌జెన్ ఆర్‌అండ్‌డీ కేంద్రంలో కంపెనీ ఎండీ డాక్టర్ డేవిడ్‌రీస్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ సోమ్ చటోపాధ్యాయతో సమావేశమయ్యారు. అనంతరం.. హైదరాబాద్‌లో కొత్తగా రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ప్రారంభించనున్నట్టు కంపెనీ ప్రకటించింది. హైటెక్ సిటీలో ఆరు అంతస్తుల భవనంలో ఈ సెంటర్ ఏర్పాటు కానున్నది. దాదాపు 3 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికం నుంచే కంపెనీ తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్టు సీఎంవో తెలిపింది. ఈ పెట్టుబడులపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణలోని నిరుద్యోగులకు భారీ ఎత్తున ఉద్యోగాలు లభిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

కమిటీ వేసెయ్.. కాలరాసెయ్!

సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ సర్కారు స్కెచ్

జలమండలి కమిటీతో చేతులు దులుపుకొనే యత్నం

- **నిపుణుల కమిటీతో వైఫల్యం బయటపడుతుందని కాంగ్రెస్ ప్రభుత్వ భయం**
- **సంఘటనను ప్రభుత్వానికి చెప్పకుండా దాచిపెట్టిన వారికే విచారణ బాధ్యతలు**
- **పనులను పర్యవేక్షించాల్సిన జలమండలి ప్రకటనలో ఏజెన్సీదే వైఫల్యమని నెపం**
- **ఏజెన్సీయే నిర్ణయాలు తీసుకుంటే ఇంజినీర్లు ఏం చేశారని రిటైర్డ్ ఇంజినీర్ల నిలదీత**
- **సభ్యుడిగా ఉన్న పీడీపై కమిటీ వ్యతిరేక నివేదిక ఇస్తుందా? అని సందేహాలు**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): 'అవకాశం దొరికితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మీద నెపం నెట్టెయ్.. లేదంటే వ్యవహారాన్ని గుట్టుగా కాలరాసెయ్!' ఇదీ.. సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ సర్కారు వైఖరి. అందుకే ఎనిమిది నెలలుగా చీమ చిటుక్కుమన్నా న్యాయ విచారణ కమిటీలు అంటూ ప్రకటన చేసే ప్రభుత్వ పెద్దలు సుంకిశాలపై మాత్రం దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. ముందుగా ఇది బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాపమేనంటూ దబాయింపునకు దిగి జలమండలి వివరణతో వెనక్కి తగ్గి.. ఇదేదో తిరిగి సర్కారు మెడకు చుట్టుకుందనే భయంతో జలమండలి కమిటీతో సరిపెట్టారు. ఒక దశలో కాంగ్రెస్ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీతో కలిపి నిపుణుల కమిటీ వేయాలని అనుకున్నా ఈ వ్యవహారాన్ని గుట్టుగా మూసేసేందుకు జలమండలి ఇంజినీర్లతో కమిటీ వేసి చేతులు దులుపుకొన్నది. మరోవైపు పనులను పర్యవేక్షించాల్సిన ఇంజినీర్లకు ఎలాంటి బాధ్యతా లేనట్టుగా ఏజెన్సీపై నెపం నెట్టి ఆ పాపాన్ని ఆకస్మిక వరదలమీదికి నెట్టారు. చిత్రమైన విషయం ఏమిటంటే ఘటనను ప్రభుత్వానికి చెప్పకుండా దాచిన వారికే విచారణ బాధ్యతలు అప్పగించారు. ఇది కాలయాపనతో గుట్టుగా సుంకిశాల ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టే వ్యూహమేనని నిపుణులు చెబుతున్నారు.

బీఆర్‌ఎస్‌పై నెట్టేందుకు తంటాలు పడి..తారుమారు

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎనిమిది నెలలుగా నానా యాగీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చివరికి ఆ ప్రాజెక్టుతోనే గోదావరి జలాలను ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా వచ్చిపడిన సుంకిశాల ఘటనతో ప్రభుత్వ పెద్దలు ఉలిక్కిపడ్డారు. వాస్తవానికి ఘటన జరిగి వారం రోజులైనా కించిత్తు సమాచారం లేకుండా ప్రభుత్వం ఒకవిధంగా అంధకారంలోనే ఉండిపోయింది. 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చిన తర్వాత కలవరపాటుకు గురైన ప్రభుత్వ పెద్దలు, నెపాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నెట్టేసేందుకు నానా తంటాలు పడ్డారు. తొలుత మంత్రి పొన్నం ప్రభాకర్ 'ఇది బీఆర్‌ఎస్ పాపమే'నని ఆరోపించడంతో పాటు కమిటీ వేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. ఇందుకు కొనసాగింపుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఈ పాపాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వేసేందుకు తీవ్రంగానే ప్రయత్నించారు. ఓవైపు సుంకిశాల గోడ కుప్పకూలిన ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తిన విమర్శలను తాళలేక ఈ పథకం పనులు బీఆర్‌ఎస్ హయాంలోనే మొదలయ్యాయని పాతమాటలు వల్లించారు. విలేకరుల సమావేశానికి ముందే జలమండలి ఎండీని, ఇంజినీర్లను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఇంజినీర్లు వాస్తవాలను ఆయనకు వివరించినట్టు తెలిసింది. దీంతో ఇదేదో ప్రభుత్వ మెడకే చుట్టుకునేలా ఉన్నదనే భావనతోనే ఆయన విలేకరుల సమావేశంలో నెపాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేశారు. కానీ జలమండలి అధికారులు మాత్రం డిప్యూటీ సీఎంకు చెప్పిన వాస్తవ వివరాలతోనే అధికారిక పత్రికా ప్రకటన విడుదల చేయడంతో సీన్ ఒక్కసారిగా తారుమారైంది.

నిపుణుల కమిటీపోయి.. జలమండలి కమిటీ..

సుంకిశాల ఘటనపై విచారణ కమిటీ వేస్తామని మంత్రి పొన్నం ప్రకటించిన తర్వాత ప్రభుత్వపరంగా కొంత కసరత్తు జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో భాగంగా నీటిపారుదల శాఖ, జలమండలి అధికారులతో నిపుణుల కమిటీ వేయాలని నిర్ణయించారు. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ హరిరాంతో పాటు జలమండలి ఈడీ సత్యనారాయణ, జేఎన్‌టీయూకు చెందిన మరో నిపుణుడితో కమిటీ వేయాలని ప్రాథమికంగా అనుకున్నట్టు సమాచారం. కానీ జలమండలి అధికారులు డిప్యూటీ సీఎంను కలవడం, ఆపై అదేరీతిన తాము అధికారిక ప్రకటన విడుదల చేయనున్నట్టు ప్రభుత్వానికి సమాచారం ఇవ్వడంతో ఒక్కసారిగా నిపుణుల కమిటీ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్టు సమాచారం. నిపుణుల కమిటీ అయితే వాస్తవాలను నివేదిక రూపంలో ఇస్తే ప్రభుత్వం ఇరకాటంలో పడుతుందని భావించిన పెద్దలు జలమండలి ఇంజినీర్లతో కమిటీ వేసి చేతులు దులుపుకొనేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఈడీ, ఇద్దరు డైరెక్టర్లతో కమిటీ వేశారు. దీనిద్వారా సుంకిశాల కథ కంచికేనని తేటతెల్లమవుతున్నది.

కొత్తగా తేల్చేదేమున్నది?

జలమండలి గురువారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలోనే ఘటనకు కారణమేమిటన్నది పూసగుచ్చినట్టు వివరించింది. కాకపోతే ఆ తప్పిదాన్ని ఏజెన్సీపై నెట్టింది. ముఖ్యంగా పథకం పనులు ఈపీసీ విధానంలో కాంట్రాక్టర్‌కు ఇవ్వలేదనే వాస్తవాన్ని ఇంజినీర్లు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు. తద్వారా నాన్ ఈపీసీ కింద ఇచ్చిన టెండర్ పనులు కావడంతో పర్యవేక్షణ బాధ్యత జలమండలి ఇంజినీర్లదే. అంటే గేటు బిగింపు, పంపుహౌస్ స్లాబ్ నుంచి టైబీమ్స్ నిర్మాణం మొదలు ఎగువ వరదను అంచనా వేయడం, సొరంగాన్ని ఓపెన్ చేయడం వరకు ఇంజినీర్లు పర్యవేక్షించాలి. ఒక్కో దశను తమ కనుసన్నల్లోనే నిర్ధారిస్తూనే ఏజెన్సీ ముందుకెళ్లాలి. ఇక్కడ అలా జరిగిందా? లేదా? అనేది కీలకం కాదని, ఏజెన్సీనే అన్ని నిర్ణయాలు తీసుకుంటే మరి ఇంజినీర్లు ఏం చేశారని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. కచ్చితంగా వారు తమ విధులను విస్మరించారనేది జలమండలి అధికారిక ప్రకటనలోనే స్పష్టమైందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జలమండలి ఇంజినీర్లతోనే కమిటీ వేస్తే కొత్తగా తేల్చేదేమున్నదని? చర్యలు ఎవరిపై తీసుకుంటారని పలువురు రిటైర్డ్ ఇంజినీర్లు ప్రశ్నిస్తున్నారు. పైగా కమిటీలో సుంకిశాల పథకం పనులను పర్యవేక్షించాల్సిన ప్రాజెక్టు డైరెక్టర్ కూడా ఉన్నారని, ఈ క్రమంలో కమిటీ ఆయనకు వ్యతిరేకంగా ఎలా నివేదిక ఇస్తుందనే సందేహాన్ని వ్యక్తంచేస్తున్నారు. ఇదంతా గుట్టుగా వ్యవహారాన్ని ముగించేందుకే తప్ప బాధ్యులపై చర్యలకు కాదని స్పష్టం చేస్తున్నారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబిత, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే వివేకానంద

'సుంకిశాల'.. సీఎం అసమర్థతే

మొదటిపేజీ తరువాయి...

చేవలేనితనం వల్లనే సుంకిశాల ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. ప్రభుత్వం తప్పు లేకుంటే ఎందుకు వారంపాటు ప్రమాదాన్ని రహస్యంగా ఉంచారని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాగానే అసెంబ్లీలో సీఎం ప్రకటన చేశారని, సుంకిశాలపై ఎందుకు ప్రకటన చేయలేదని నిలదీశారు. ప్రభుత్వానికి ప్రమాదం విషయం తెలియదా? తెలిసినా పట్టించుకోలేదా? అని నిలదీశారు. ప్రభుత్వానికి విషయం తెలియలేదంటే సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ప్రమాదం గురించి సీఎంకు, ప్రభుత్వానికి సమాచారం తెలుసునని, వారంపాటు గోప్యంగా ఉంచారని మండిపడ్డారు. అధికారులు చెప్పినా వినకుండా గేట్లు అమర్చడంతో ప్రమాదం జరిగిందని ఆరోపించారు. అదృష్టవశాత్తు కూలీలు షిఫ్ట్ మారినప్పుడు ప్రమాదం జరిగిందని, లేకుంటే చాలా ప్రాణనష్టం జరిగేదని ఆవేదన వ్యక్తంచేశారు. మంచి జరిగితే తమ ఘనత, చెడు జరిగితే బీఆర్‌ఎస్ తప్పు అంటూ తప్పుడు ప్రచారం చేసే చిల్లర ప్రయత్నాలు వద్దని హితవు చెప్పారు.

కేసీఆర్ విజయాలను అంగీకరించలేక..

ఎన్నికల్లో ప్రయోజనం కోసం కాళేశ్వరంపై చేసిన అడ్డగోలు వాదన వీగిపోయిందని, 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాజెక్టు చెక్కుచెదరకుండా ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిజంగానే పూర్తిగా విఫలమైతే, ఇప్పుడు ఏవిధంగా రిజర్వాయర్లను నింపుతున్నదని ప్రశ్నించారు. 'వీళ్లకు సరుకు లేదు. సబ్జెక్ట్ లేదు. బరాజ్ గేట్లు ఎప్పుడు దించుతారో కూడా తెలియదు' అని మండిపడ్డారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోయడానికి ఇబ్బంది లేదని, ఇంత మంచి ప్రాజెక్ట్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇంజనీర్లే ఆవేదన వ్యక్తంచేస్తున్నారని చెప్పారు.

జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

సుంకిశాల ప్రమాదంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలని, ఘటన స్థలంలోనే భట్టి విక్రమార్క పకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మేడిగడ్డ అంశంపై తాము జాప్యం చేయలేదని, ఎన్నికల కోడ్ ఉన్నా సరే ప్రమాదం జరిగిన విషయాన్ని చెప్పామని గుర్తుచేశారు. ఘటన జరిగిన గంటల్లోనే లోపాలు సరిదిద్దుతామని ఎల్‌అండ్‌టీ చెప్పిందని, రహస్యంగా ఉంచాల్సిన అవసరం లేదని కేటీఆర్ స్పష్టంచేశారు. కానీ, సీఎం సుంకిశాల విషయాన్ని ఎందుకు దాచారని ప్రశ్నించారు. ప్రమాదం జరిగినప్పుడు సీఎం హైదరాబాద్‌లోనే ఉన్నారని, ఆ మరునాడే దాని మీద పర్యవేక్షణ, సమీక్ష లేకుండా అమెరికా వెళ్లారని ఆరోపించారు. భట్టి విక్రమార్క ఇతరులపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని, ఒకవేళ సీఎంకు విషయం తెలియకపోతే ఆయనకు పరిపాలనపై పట్టు లేనట్టేనని కేటీఆర్ స్పష్టంచేశారు.

సుంకిశాల చరిత్ర ఇది.

మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి హయాంలో సుంకిశాల ప్రతిపాదన చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. అప్పట్లో తమకు అన్యాయం చేయొద్దంటూ రైతులు అడ్డుకోవడంతో ఎస్‌ఐ కూడా చనిపోయారని, గత ప్రభుత్వాల హయాంలో రెండు, మూడు దశ లు అంటూ ప్రతిపాదనలు తెచ్చారని వివరించారు. రైతులు మళ్లీ అడ్డుకోవడంతో ప్రాజెక్ట్ ఆగిపోయిందని చెప్పారు. ఆ తరువాత రైతు ల్లో విశ్వాసం నింపడంతో సుంకిశాలను అడ్డుకోలేదని తెలిపారు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు ఎత్తిపోయాలంటే నాగార్జునసాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం ఉంటే నే సాధ్యమవుతుందని, సుంకిశాలలో 462 అడుగులున్నా సరే నీళ్లు తీసుకోవచ్చని, రాబో యే 50 ఏండ్లలో హైదరాబాద్ నీటి అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును కేసీఆర్ చేపట్టారని వివరించారు. నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రజా ప్రతినిధులందరితో కలిసి దీనికి శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. మూడు పైప్‌లైన్ల ద్వారా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతున్నదని, కృష్ణానదికి మూడు, నాలుగేండ్లు వరద రాకపోయినా డెడ్‌స్టోరేజీ నుంచి సుంకిశాల ద్వారా నీళ్లు తేవచ్చని చెప్పారు. ఓఆర్‌ఆర్ చుట్టూ ఒక రింగ్ మెయిన్ చేయాలనే ఉద్దేశంతో గోదావరి, కృష్ణా నీళ్లు తీసుకొచ్చే ప్రయత్నం చేశామని కేటీఆర్ వివరించారు.

మహానగరాల్లో కొరత కానీ,

ఢిల్లీ, బెంగళూరు లాంటి మహానగరాల్లో భారీగా నీటి కొరత ఉన్నదని, నీళ్ల కోసం యుద్ధాలు జరిగే పరిస్థితి హైదరాబాద్‌లో లేదని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్‌కు తాగునీటి కొరత లేకుండా చేసేందుకే సుంకిశాల ప్రాజెక్ట్ చేపట్టామని వివరించారు.. సుంకిశాల పనులు చాలా వేగంగా పూర్తి చేశామని, ఒక్క మోటర్ ఫిట్టింగ్ పనులు మాత్రమే మిగిలిపోయాయని, 2024 వేసవికాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం పనులను పెండింగ్‌లో పెట్టిందని మండిపడ్డారు. మొన్నటి ఎండకాలంలో హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లు తెప్పించుకోవాల్సిన దుస్థితి రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు వచ్చాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద కూడా విమర్శలు రావడంతో రెండు, మూడు నెలల క్రితం దున్నపోతు నిద్రవీడారని ఎద్దేవా చేశారు. ఆ తర్వాత అధికారులపై ఒత్తిడి పెట్టి ఆగమాగంగా పనులు చేపట్టారని, ఈ ప్రమాదం ఎందుకు జరిగిందనే అంశంపై జలమండలి అధికారితో వివరంగా మాట్లాడానని కేటీఆర్ తెలిపారు. 'సీతారామ ప్రాజెక్ట్ గురిం చి భట్టివిక్రమార్క బిల్డప్ ఇచ్చారు. ఆ ప్రాజెక్ట్‌ను చేపట్టింది, పూర్తి చేసింది కూడా కేసీఆరే. కేసీఆర్ పూర్తి చేసిన పథకాన్ని కాంగ్రెస్ పూర్తి చేసినట్టు చెప్పుకున్నా ప్రజలకు అన్ని విషయాలు తెలుసు' అని కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే వివేకానంద పాల్గొన్నారు.

పరిపాలన చేతకాక...

ఎస్సెల్బీసీ టన్నెల్ పనులను కూడా వేగంగా చేశామని, సాగునీటితోపాటు తాగునీటికి కూడా ప్రాధాన్యం ఇవ్వడంతోనే రైతులు ఆందోళన చేయలేదని కేటీఆర్ వివరించారు. పేర్లు మార్చడామేనా మార్పు అంటే? అని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క తన ఆలోచనా విధానం మార్చుకోవాలని సూచించారు. తాము కూడా సుంకిశాలకు వెళ్లి అన్ని విషయాలు అక్కడ నుంచి వివరిస్తామని ప్రకటించారు. నీళ్ల విషయంలో కేసీఆర్‌కు పేరు వస్తదనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పరిపాలన రాక ప్రతి దానికి కేసీఆర్ మీద తప్పుడు ప్రచారం చేసున్నారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ సరిగా లేదని, వారి బాకా ఊదే పత్రికలే శాంతిభద్రతల మీద కథనాలు రాస్తున్నాయని చెప్పారు.

> నీళ్ల విషయంలో కేసీఆర్ విజయాలను అంగీకరించలేని కురచ మనస్తత్వంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. మేడిగడ్డ మీద విచారణ చేస్తున్నారు. పది లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా సరే మేడిగడ్డకు ఏమీ కాలేదు. ఇన్నాళ్లు కాళేశ్వరంపై చిల్లర, దివాలాకోరు ప్రచారాలు చేశారు. ప్రకృతే తప్పుడు ప్రచారాలకు సమాధానం చెప్పింది. -కేటీఆర్

> కాళేశ్వరంలో ప్రమాదం జరిగితే ఎన్డీఎస్‌ఏ వస్తది, ఆగమేఘాల మీద రిపోర్ట్ ఇస్తది, మరి సుంకిశాలకు ఎందుకు కేంద్ర సంస్థ వస్తలేదు. ఇది కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయారనడానికి నిదర్శనం. -కేటీఆర్

> సుంకిశాల ప్రాజెక్టులో ఇంజనీరింగ్ లోపం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన విధానంలోనే లోపం ఉన్నది. సుంకిశాల ప్రమాదానికి కారణమై రాష్ట్ర ప్రజల సొమ్మును ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. ఇది మూర్ఖ, కుత్సిత మనస్తత్వం ఉన్న ప్రభుత్వం. -కేటీఆర్

కూలిన ఘటన మాదాకా రాలేదు!

- **చిన్న ఘటన కాబట్టే జలమండలి ఇంజినీర్లు చెప్పలేదు**
- **సుంకిశాల ప్రమాదంపై మారిన కాంగ్రెస్ సర్కారు స్వరం**
- **మొన్న బీఆర్‌ఎస్ పాపమన్న భట్టి**
- **సోషల్‌మీడియాలో చూసి ప్రభుత్వం స్పందించిందన్న మంత్రులు**
- **సీఎంతో చర్చించి ఉన్నతస్థాయి కమిటీ వేస్తామని వెల్లడి**
- **చైర్మన్ గుత్తాతో కలిసి వాల్ కూలిన ప్రదేశం పరిశీలన**

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ సర్కారు తెల్లముఖం వేసింది. వారం కింద జరిగిన ఘటనపై జలమండలి, ఏజెన్సీ గోప్యత పాటించాయని అందరికీ తెలిసిన సత్యం!. కానీ ఈ రాష్ర్టాన్ని పాలిస్తున్న ప్రభుత్వ పెద్దలకు ఘటనపై సమాచారమే లేదట! మీడియాలో వస్తే గానీ ప్రభుత్వానికి తెలవలేదట! అవును.. సాక్షాత్తూ ఇద్దరు మంత్రివర్యులే శుక్రవారం ఈ అంశంపై కుండబద్దలు కొట్టారు. అంతేకాదు.. 'ఇది చాలా చిన్న సంఘటన అయినందున, ఇంజినీర్లు వాళ్ల స్థాయిలోనే పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వానికి చెప్పలేదు' అని గోప్యత పాటించిన జలమండలి అధికారుల భుజం కూడా తట్టారు. ఇక.. ప్రమాదానికి కారణాన్ని కూడా మంత్రులు మీడియాకు సెలవిచ్చారు. వేసవిలో నీళ్లివ్వాలనే తాపత్రయంతోనే పనులు త్వరితగతిన చే పట్టారని, దీంతో ప్రమాదం జరిగిందని తేల్చిపారేశారు. ప్రమాదంతో నష్టమేమీలేదని, కాం ట్రాక్టు సంస్థనే నష్టాన్ని భరిస్తుందంటూ సర్కా రు ఖజానాకు భరోసా ఇచ్చారు. మరి దశాబ్దాలుగా అరిగోస తీస్తున్న రైతులకు సాగునీరివ్వాలనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం కేవలం మూడేండ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన దరిమిలా చోటుచేసుకున్న చిన్న లోపా న్ని మాత్రం ఈ మంత్రులే భూతద్దం పెట్టి చూ పించడం గమనార్హం. మరోవైపు సుంకిశాల ఘటనపై గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 'లాట్.. ఇదంతా బీఆర్‌ఎస్ పాపమే' అని వ్యాఖ్యానించగా శుక్రవారం సుంకిశాల పర్యటనలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల 'త్వరితగతిన నీళ్లివ్వాలనే తాపత్రయంలోనే ప్రమా దం జరిగింది' అంటూ స్వరం మార్చారు. శుక్రవారం సుంకిశాల సందర్శనకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా వస్తున్నారంటూ ముందుగా సమాచారం విడుదల చేసినా ఆయన మాత్రం సొంత జిల్లాలోనే ఉండిపోయి, సందర్శనకు రాకపోవడంపై గుసగుసలు వినిపిస్తున్నాయి. శుక్రవారం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని సుంకిశాల ప్రాజెక్టు ను భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సందర్శించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి కోదాడకు వెళ్లి అక్కడ తుమ్మల నాగేశ్వర్‌రావును ఎక్కించుకొని సుంకిశాలకు చేరుకున్నారు. ముందుగా పంపుహౌస్ వద్ద గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరంమీడియాతో మాట్లాడారు.

నల్లగొండ జిల్లాలోని సుంకిశాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ప్రభుత్వం దృష్టికి రాలేదు : తుమ్మల

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ 'వచ్చే వేసవికి నీళ్లివ్వాలి కాబట్టి థర్డ్ టన్నెల్ ఓపెన్ చేసి పనులను ఆలస్యం కాకుండా చూడాలని తొందరపడి ఉండొచ్చు. నీళ్లివ్వాలన్న తాపత్రయం ఉండొచ్చు. కానీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకున్నారా? పనిలో ఉన్న నాణ్యత ఏమిటి? ఘటనకు కారణం ఏమిటి? అన్నది తేలాల్సి ఉన్నది. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం దృష్టికి రాలేదు. చిన్న సంఘటన కాబట్టి రెక్టిఫై చేసుకుంటామనే ఉద్దేశంతో ఇంజినీర్లు లేదా ఏజెన్సీ, అధికారులు ప్రభుత్వం దృష్టికి తేలేదు' అని వెల్లడించారు. ఎప్పుడైతే మీడియా దృష్టికి వచ్చిందో ప్రభు త్వం స్పందించి కమిటీ వేసి రిపోర్ట్ ఇవ్వాలని చెప్పామని, బాధ్యులెవరనేది ప్రభుత్వం గుర్తిస్తుందని చెప్పుకొచ్చారు. 'ప్రభుత్వాలు కంటిన్యూస్ ప్రాసెస్ కాబట్టి.. తప్పు జరిగినా ఒప్పు జరిగినా పూర్తి చేయాల్సిందే. ఈ పథకాన్ని ప్రభుత్వం కంటిన్యూ చేస్తుంది' అని చెప్పారు.

సీఎంపై విమర్శలు సరికాదు : గుత్తా

సుంకిశాల ఘటనపై దురుద్దేశపూర్వకంగా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ శాఖ సీఎం వద్ద ఉన్నంత మాత్రాన ఆయనపై విమర్శలు చేయడం పాత మున్సిపల్ మంత్రి(కేటీఆర్)కి తగదన్నారు. 'హైదరాబాద్‌లో అసలు నీళ్ల కొరత లేదు.. సుంకిశాల ప్రాజెక్టు అవసరమే లేదు.. నిన్నటి దాక ప్రభుత్వంలో ఉండి నిరుపయోగమైన ప్రాజెక్టును ప్రజల మీద రుద్దుతూ ఇపుడున్న ప్రభుత్వం మీదనో.. సీఎం మీదనో దుమ్మెత్తి పోస్తాననడం సరికాదు. కాబట్టి జరిగిన ఘటనలో మంచి గానీ, చెడుగానీ మీ ఖాతాలోనే ఉంటుంది' అని గుత్తా వ్యాఖ్యానించారు. రూ.1400 కోట్ల అంచనాతో ప్రారంభించిన ప్రాజెక్టు ప్రస్తుతం రూ.2200 కోట్లకు చేరిందని, రానున్న కాలంలో నాలుగు వేల కోట్లకు చేరినా ఆశ్చర్యం అక్కరలేదని తెలిపారు. ఈ ప్రాజెక్టును కేసీఆర్, కేటీఆర్ ఎందుకు ప్రారంభించారో వారికి గాని, కాంట్రాక్టు సంస్థకు గాని తెలవాల్సి ఉందన్నారు. 'ఏదేమైనా ఒక ప్రభుత్వం ప్రారంభించి రూ.840 కోట్లు ఖర్చు చేసింది. డిసెంబర్ నుంచి ఈ ప్రభుత్వం రూ.1100 కోట్లు ఖర్చు చేసింది. వాస్తవంగా రూ.2200 కోట్లు పెట్టి టన్నెల్ పూర్తి చేస్తే గ్రావిటీతో నీళ్లు వస్తాయి. ఈ ఘటనలో టెక్నికల్‌గా కాంట్రాక్టరే కడుతాడు. ప్రభుత్వం మీద భారం పడనియ్యం అనేది మరో విషయం. దీనంతటికీ కారణం బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే'నని వ్యాఖ్యానించారు.

ఘటన చిన్నది.. నష్టం తక్కువ : మంత్రి ఉత్తమ్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వాస్తవ పరిస్థితిని ఫీల్డ్‌లో పరిశీలించి, ఫీల్డ్ ఇంజినీర్లు, ఏజెన్సీతో మాట్లాడి ప్రభుత్వం ఎలా ముందుకు పోవాలో తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు. 'జరిగిన సంఘటన చిన్నది, జరిగిన నష్టం చాలా తక్కువ. అది కూడా బాధాకరమే. కానీ ఒకట్రెండు నెలలు పనుల ఆలస్యం తప్పితే ఎంత నష్టం జరిగినా అది కాంట్రాక్టు సంస్థనే భరిస్తుంది. ప్రభుత్వానికి నష్టమేమీ లేదు. ఈ ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. నిర్మాణంలో ఉన్నది. ఈ ప్రాజెక్టు అన్ని విధాలా పూర్తయ్యాక ప్రభుత్వానికి అప్పజెప్పాల్సిన బాధ్యత వాళ్లదే. జరిగిన సంఘటన దురదృష్టకరం. ఈ ఘటన వల్ల ఒకట్రెండు నెలలు ఆలస్యమవుతుంది. ప్రాణనష్టం జరగలేదు. జరిగిన నష్టం ఎంతైనా సరే కాంట్రాక్టరే భరిస్తారు. ఈ పరిస్థితి రావడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణం' అని చెప్పారు. 'ఎందుకు ప్రతిపక్ష నేతలు మొత్తుకుంటున్నారో అర్థం కావడం లేదు. డిజైన్ చేసింది మీరు.. కాంట్రాక్ట్ ఇచ్చింది మీరు.. నిర్మాణం జరిగింది మీ హయాంలో.. మీ కమీషన్ కక్కుర్తో ఏమో గానీ రిటైనింగ్ వాల్ కూలిపోయింది. ఒక్కసారి ఆలోచన చేయాలి. 2014లో అధికారంలోకి వస్తే ఎన్నికలకు ఒకట్రెండు ఏండ్ల ముందు పనులు మొదలుపెట్టడంలో మతలబేమిటో ఆలోచించాలి. ఇదంతా మీరే చేసినా పడిపోవడం దురదృష్టకరం అంటున్నం. దీని వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు నష్టమేం లేదు. మొత్తం ఖర్చు కాంట్రాక్టర్ భరిస్తారు' అని ఉత్తమ్ చెప్పుకొచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉత్తర తెలంగాణకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇచ్చిన ప్రాధాన్యత కృష్ణాబేసిన్‌కు, దక్షిణ తెలంగాణకు ఇవ్వలేదని ఆరోపించారు. 'దీనికారణంగానే ఎల్‌ఎల్‌బీసీ టన్నెల్ పూర్తికాలేదు, ఈ ప్రభుత్వం పక్షాన.. సీఎం పక్షాన స్పష్టమైన హామీ ఇస్తున్నం.. మా హయాంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎల్‌ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేస్తం. డిండి ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తిచేస్తం' అని చెప్పారు.